తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
శుక్రవారం
23 అక్టోబర్ 2026
పేజీలు - 12



## డిసెంబరులో జాతీయస్థాయి క్రీడా సంబరం

- దేశవ్యాప్తంగా అథ్లెట్ల రాక
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) మరో ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వేదిక కానుంది.

వార్త మెయిన్ 7లో

# కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ల దందా!

- రూ.39.14 లక్షలు కాంట్రాక్టర్ల నుంచి బదిలీ!
- బిల్లుల చెల్లింపులకు పర్సంటేజీలు
- ఫోన్లలో బయటపడ్డ బాగోతం
- డీఆర్‌డీఓ కార్యాలయంలో ఏసీబీ సోదాలు
- ఇద్దరు అధికారుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ సాంబయ్య

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** భూగర్భ జలాలను పెంపొందించి, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులను అభివృద్ధి చేయాల్సిన వాటర్‌షెడ్ ప్రాజెక్టులో అవినీతి బాగోతం వెలుగుచూసింది. ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టాల్సిన పనుల్లో పర్సంటేజీల పేరుతో వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల వ్యవహారం ఏసీబీ తనిఖీలతో బట్టబయలైంది.




వార్త మెయిన్ 7లో

# ఎల్ నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం

- సమన్వయంతో పనిచేసి ఎల్నినో ప్రభావాన్ని అధిగమించాలి
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**మావల అక్టోబర్ 23( జనం సాక్షి) :** రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, ప్రజాప్రతినిధులు, అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ వీసీ హాల్ నుండి ఎల్నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, కార్యాచరణపై గూగుల్ మీట్ ద్వారా ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ఎల్ నినో పరిస్థితులను అధిగమించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొని ఉండగా, సాధారణ వర్షపాతం కంటే 35 శాతం లోటు నమోదైందని వెల్లడించారు. ఏ మండలాల్లో కరువు ప్రకటించాలనే దానిపై ప్రభుత్వానికి సమగ్ర నివేదికలు పంపించామని, కేబినెట్ తీసుకునే నిర్ణయం ఆధారంగా తగిన సహాయక చర్యలు అమలవుతాయని తెలిపారు. కరువు సమయంలో మనుషులు గానీ, పశువులు గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణాలు కోల్పోకూడదని, ప్రాణనష్టం జరగకుండా చూసే బాధ్యత అందరిపై ఉందని ఉద్ఘాటించారు. రైతులు తీవ్ర ఇబ్బందులతో తీవ్ర నిర్ణయాలు వైపు వెళ్లకుండా సర్పంచులు, అధికారులు వారిని అప్రమత్తం చేసి తగిన కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. అప్పుల భారంతో లేదా అనారోగ్యంతో బాధపడుతున్న రైతులకు భరోసా కల్పించి, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా తగిన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. పంట కోతల అనంతరం పొలాల్లో మిగిలే అవశేషాలను రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్చవద్దని స్పష్టం చేశారు. ఈ అవశేషాలను నేలలో కలిపి మల్చింగ్ చేయడం వల్ల నేలలో తేమ శాతం పెరిగి, తద్వారా శనగ, మినుములు, నువ్వులు తదితర పంటల దిగుబడి బాగా రావడానికి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. అంతేకాకుండా పశువుల మేత కోసం సైతం వీటిని సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించి పంట అవశేషాలకు నిప్పు పెడితే గ్రామ పంచాయతీల ద్వారా జరిమానా విధించేలా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తాగునీటి సరఫరాలో మిషన్ భగీరథ లీకేజీలను గుర్తించి తక్షణమే సరిచేయాలని, ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించే ప్రాంతాలను ముందుగా గురించి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మారుమూల ఆవాసాలు, గుట్ట ప్రాంతాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో కనీసం 60 నుంచి 70 మంది కూలీలతో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అందుబాటులో లేని చోట సీనియర్ మేట్లను నియమించి ఉపాధి కల్పించాలని, రికార్డులను ఎక్కడా ఆలస్యం చేయకుండా ఎంబీ రికార్డు, ఈసీ ప్రక్రియలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. సాత్నాల, మత్తడి వాగు, బజార్‌హత్నూర్ తదితర ప్రాంతాల్లోని అభివృద్ధి మిగతా 11లో..



# హోలిస్టిక్ రూరల్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ద్వారా అభివృద్ధి చర్యలు

- జిల్లా కలెక్టర్ కె.హరిత

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22(జనంసాక్షి ):** జిల్లాలోని తిర్యాణి మండలంలో మారుమూల గ్రామాలలో మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఉపాధి, త్రాగునీరు, రహదారి వంటి మౌలిక వసతుల కల్పనకు హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్, సి.వై.డి.ఓ. ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లాలోని తిర్యాణి మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ నిధుల సహకారంతో సి వై డి ఓ సంస్థ అమలు చేస్తున్న హోలిస్టిక్ రూరల్ డెవలప్మెంట్ ప్రాజెక్టును జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, హెచ్ డి ఎఫ్ సి సి వై డి ఓ సంస్థ ప్రతినిధులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తిర్యాణి మండలంలోని మారుమూల గ్రామాలలో విద్య, వైద్యం, సాగునీరు, త్రాగునీరు, పోషకాహారం తదితర కీలక రంగాలలో అవసరాలను గుర్తించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సర్పంచులు, స్వయం సహాయక సంఘాల మహిళల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. అభివృద్ధిలో భాగంగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, ప్రాథమిక మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను మిగతా 11లో..

# కాంగ్రెస్ శ్రేణులు సమిష్టిగా పనిచేయాలి

### పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 22 (జనం సాక్షి) :**రాబోయే వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థి శ్రీ రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రకటించిన అధికారిక అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కట్టుబడి పనిచేయాలని అన్నారు. డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశం స్ఫూర్తితో హనుమకొండ జిల్లాలోని ప్రతి డివిజన్, మండల స్థాయిలో సమన్వయంతో ఎన్నికల సన్నాహాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించి, కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ తొగరు జగన్ మోహన్ రెడ్డి, కో-కన్వీనర్ బోడ దినేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అజీజ్ ఖాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, భట్టి శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్లు పుప్పాల ప్రభాకర్, తోట వెంకటేశ్వర్లు, విజయశ్రీ రజాలీ, తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్, వేముల శ్రీనివాస్, నెక్కొండ కిషన్, డీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్ కమిటీ చైర్మన్ మార్క విజయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీపై గులాబీ గురి!

- ఓటరు నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి
- పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే గండ్ర పిలుపు



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని, ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ పరిధిలోని ప్రతి గ్రాడ్యుయేట్‌ను వ్యక్తిగతంగా కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చొరవ తీసుకోవాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియను కేవలం కార్యక్రమంగా కాకుండా, బాధ్యతగా భావించి క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీకి ప్రతిష్టాత్మకమైనవని పేర్కొంటూ, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావడంతో పాటు ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. పార్టీ శ్రేణుల సమిష్టి కృషితో అర్హులైన గ్రాడ్యుయేట్లందరినీ ఓటర్లుగా నమోదు చేయించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని గండ్ర వెంకట రమణారెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సెగ్గెం సిద్ధు, మండల రవీందర్ రెడ్డి, కటకం జనార్ధన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రావణాసురుడి ప్రతిమపై నేతల ప్రతిరూపాలు

### ఘటనపై విచారణ జరపాలి: బీజేపీ



**గీసుకొండ మండలం, అక్టోబర్ 22, (జనం సాక్షి)** గీసుగొండ అక్టోబర్ 22: కొత్తగూడెంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రతిరూపాలను రావణాసురుడి ప్రతిమపై ఉంచినట్లు వచ్చిన వార్తలపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ గీసుగొండ మండల అధ్యక్షుడు కొంగర రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలు, నిరసనలు తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే అవి చట్టబద్ధంగా, ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించి, కార్యక్రమంలో పాల్గొన్న వారి పాత్రపై విచారణ జరపాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. చట్టవిరుద్ధమైన చర్యలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల గౌరవం, చట్టంపై విశ్వాసం ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బిల్లా రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్, అడెపు రమేష్, ములక సత్యం, గీసుగొండ బీజేవైఎం అధ్యక్షుడు సల్లా శ్రావణ్, ఐలోని నరేందర్, కందుల రవివర్మ, 15వ డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడు దొమ్మటి రాజ్‌కుమార్, 16వ డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడు కందుకూరి విజయ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

### పరకాల పోలీస్ స్టేషన్‌లో బీజేపీ ఫిర్యాదు




**పరకాల, అక్టోబర్ 23,(జనంసాక్షి):** కొత్తగూడెంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ ప్రతిరూపాలను రావణాసురుడి ప్రతిమపై ఏర్పాటు చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షుడు గాజుల నిరంజన్ డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం పరకాల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే నిరసనలు చట్ట పరిధిలోనే జరగాలన్నారు. కొత్తగూడెం ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని పోలీసులను కోరారు. చట్ట ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా కోశాధికారి ఎర్రం రామన్న, పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, జిల్లా నాయకులు బాసాని సోమరాజు, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కక్కు రాజు, సోషల్ మీడియా కన్వీనర్ మెంతుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

### రక్తదాన శిబిరంలో పాల్గొన్న బీజేపీ నాయకులు



**పరకాల, అక్టోబర్ 23,(జనంసాక్షి):** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పరకాల డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో బీజేపీ పరకాల పట్టణ నాయకులు పాల్గొన్నారు.పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కౌన్సిలర్లు కుక్కల విజయకుమార్, బెజ్జంకి పూర్ణచారి, పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, నాయకులు బాసాని సోమరాజు, కక్కు రాజు, మెంతుల సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రక్తదానం ప్రాణదానంతో సమానమని, మనం చేసే చిన్న సహాయం మరొకరి జీవితాన్ని కాపాడుతుందని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సహాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానంపై అవగాహనతో పాటు సేవా కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# రాష్ట్రస్థాయి రబ్బి పోటీలకు జల్లి విద్యార్థి ఎంపిక




**చెన్నారావుపేట, అక్టోబర్ 22 ( జనం సాక్షి):** రాష్ట్రస్థాయి రబ్బీ పోటీలకు మండలంలోని జల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న బోడ జగన్ అనే విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 1వ తేదీన జె ఎన్ ఎస్ హనుమకొండ స్టేడియంలో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి రబ్బీ పోటీలలో బోడ జగన్ అనే విద్యార్థి అండర్ 19 ఇయర్స్ బాలుర విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి రబ్బీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.రాష్ట్రస్థాయి క్రీడలు ఈనెల 23, 24 తేదీలలో హైదరాబాద్ లోని సరూర్ నగర్ స్టేడియంలో జరిగే క్రీడల్లో పాల్గొంటాడని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జి. బిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా జగన్ అనే విద్యార్థిని ఉపాధ్యాయులు సరిత, అశోక్, శైలజ, అనిత, లక్ష్మయ్య, సుభాష్, శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈర్య, కుమారస్వామి, శ్యామ్ సుందర్, జగన్మోహన్ తదితరులు అభినందించారు.

## పచ్చదనం పెంచడం పర్యావరణాన్ని కాపాడుదాం

### గ్రామ సర్పంచ్ కొండగొర్ల బాపు



**మహా ముత్తారం అక్టోబర్ 22 (జనం సాక్షి)** మొక్కలు నాటి పచ్చదనం పెంచడం పర్యావరణాన్ని కాపాడే విధంగా ఉండాలని అందరూ భాగస్వాములు కావాలని గ్రామ సర్పంచ్ కొండ గొర్ల బాబు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచి మరియు కాటారం డివిజన్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొండ గొర్ల బాపు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాముత్తారం మండలం కేంద్రంలో,మక్త కుంట కట్ట వద్ద శ్రమదానం నిర్వహించి, మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, చెరువుల పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నాటిన మొక్కలను సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. నాటిన మొక్కలను వాటి ఎదుగుదల సమృద్ధిగా ఉండాలని సంబంధిత అధికారులు సక్రమంగా చూసుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, టీఏ ప్రమీల, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై గోవర్ధన్‌ను కలిసిన బిజెపి నాయకులు



**చెన్నారావుపేట, అక్టోబర్ 22 ( జనం సాక్షి):** నూతనంగా బాధ్యతలు చేపట్టిన చెన్నారావుపేట ఎస్సై పొన్నాల గోవర్ధన్ ను బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం పోలీస్ స్టేషన్లో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు సంగెం శంకర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ దుంకదువ్వ రంజిత్, మండల ప్రధాన కార్యదర్శి మురహరి విజయ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు కాందాల చంద్రమౌళి, విజయ్ కుమార్, మండల కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వీరు నాయక్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు వీరమల్ల మహేందర్, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్తియా శశిందర్, సీనియర్ నాయకులు మెరుగు కుమారస్వామి, కర్రె సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

### పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని

## నూతన భవనంలోకి మార్చాలి



**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 22 (జనం సాక్షి)** రంగశాయిపేటలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనంలోకి తక్షణమే మార్చాలని కోరుతూ ఈరోజు వరంగల్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ గౌరవనీయులు డాక్టర్ సత్య శారద గారికి వినతిపత్రం సమర్పించడం జరిగిందిప్రస్తుతం ఉన్న ఆసుపత్రి ప్రాంగణంలో స్థానిక ప్రజలు వైద్య సేవలు పొందేరుకు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు, వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు వైద్య సేవల కోసం అసౌకర్యానికి గురవుతున్నారు.ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ఇప్పటికే నిర్మించిన నూతన ఆసుపత్రి భవనంలోకి రంగశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే తరలించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్‌ని కోరడం జరిగింది.ప్రజల ఆరోగ్యం, సౌకర్యం దృష్ట్యా సంబంధిత అధికారులు ఈ విషయంపై తక్షణమే స్పందించి, ఆసుపత్రి మార్పిడి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మండల పరశురాములు మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా పాల్గొన్నారు.

## ఆదివాసీల హక్కుల పోరాటయోధుడు కొమురం భీం: పుల్ల మల్లయ్య

### చిట్యాలలో ఘనంగా కొమురం భీమ్ జయంతి వేడుకలు



**చిట్యాల, అక్టోబర్ 22(జనం సాక్షి):** దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీల హక్కుల కోసం, వారి స్వయంపాలన కోసం అలుపెరుగని పోరాటం చేసిన ధైర్యశాలి కొమురం భీమ్ అని అంబేద్కర్ ఫెలోషిప్ నేషనల్ అవార్డు గ్రహీత, ఛూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నే యుగేంధర్ ఆధ్వర్యంలో కొమురం భీమ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పుల్ల మల్లయ్య, జన్నే యుగేందర్, కొలిపాక సాంబయ్యలు మాట్లాడుతూ... అనాదిగా అణచివేతకు గురవుతున్న గిరిజనుల విముక్తి కోసం 'జల్, జంగల్, జమీన్' (నీరు, అడవి, భూమి) అనే నినాదంతో నిజాం నిరంకుశ పాలనపై వీరోచితంగా పోరాడిన తెలంగాణ ముద్దుబిడ్డ కొమురం భీమ్ అని కొనియాడారు. అడవిపై సర్వహక్కులు ఆదివాసీలకే చెందాలని ప్రాణాలర్పించిన అమరుడు, గిరిజనుల ఆరాధ్య దైవమని పేర్కొన్నారు. స్వేచ్ఛ, మానవత్వం, సామాజిక న్యాయం మరియు మహిళల ఆత్మగౌరవం కోసం ఎదిరించి నిలిచిన గొప్ప విప్లవ వీరుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రాజేందర్, చిట్యాల మండల సీనియర్ నాయకులు గురుకుంట్ల కిరణ్, గడ్డం సదానందం, రేగొండ మండల నాయకులు కొలిపాక సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన హక్కుల సాధనకు కొమరం భీమ్ పోరాటం స్ఫూర్తిదాయకం

### ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 22 (జనం సాక్షి) :** కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో గురువారం గిరిజన హక్కుల ఉద్యమ నేత కొమరం భీమ్ జయంతి వేడుకలను కళాశాల ఎస్సీ ఎస్టీ సెల్ సంచాలకులు డాక్టర్ పుల్లా రమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. అణచివేతకు వ్యతిరేకంగా నిలబడి, గిరిజన ప్రజల హక్కుల సాధన కోసం ఆయన సాగించిన ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అడవి, భూమి, నీటిపై గిరిజనులకు హక్కులు ఉండాలనే ఆయన ఆకాంక్ష గిరిజన సంక్షేమం, సామాజిక న్యాయం పట్ల ఆయనకున్న నిబద్ధతను తెలియజేస్తుందని అన్నారు. కొమరం భీమ్ ఆశయాలను విద్యార్థులు తెలుసుకోవడంతో పాటు సమానత్వం, సామాజిక న్యాయం, మానవీయ విలువలను జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం ద్వారా వారి ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎన్. రెహమాన్, ఫ్యాకల్టీ క్లబ్ చైర్మన్ డాక్టర్ బిక్షపతి ,అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## కలెక్టరేట్‌లో ఘనంగా పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి కార్యక్రమం

### సాయన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 22 (జనం సాక్షి) :**హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, రాష్ట్ర మేర కార్పొరేషన్ చైర్మన్ సంగు వెంకట్రాజం, ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, ముదిరాజ్ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న ముదిరాజ్ ధైర్య సాహసాలు, చేసిన సేవలను అధికారులు ముదిరాజ్ సంఘం ప్రతినిధులు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సంపూర్ణ, ఇతర అధికారులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు దేవేందర్ ముదిరాజ్, పొన్నం రాజ్, పులి రజనీకాంత్, పొన్నం మొగిలి, బండి సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

## కొమరం భీమ్ ఆశయ సాధనే నిజమైన నివాళి

### కౌన్సిలర్ బానోత్ నవీన్ నాయక్



**నర్సంపేట: అక్టోబర్ 22 (జనం సాక్షి)** జల్, జంగిల్, జమీన్ నినాదంతో నిజాం నిరంకుశ పాలనపై పిడికిలెత్తి పోరాడిన అపర విప్లవ వీరుడు, గిరిజన ఆత్మగౌరవ ప్రతీక కొమరం భీమ్ జయంతిని పురస్కరించుకుని నర్సంపేట మున్సిపాలిటీ కౌన్సిలర్ బానోత్ నవీన్ నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నవీన్ నాయక్ మాట్లాడుతూ... "అడవిపై సర్వహక్కులు ఆదివాసీలకే దక్కాలని గళమెత్తిన ధీశాలి కొమరం భీమ్. నిజాం నవాబుల దోపిడీకి, జాగీర్దార్లు, పట్వారీల అరాచకాలకు వ్యతిరేకంగా ఆదివాసీలను ఒక్కతాటిపైకి తెచ్చి జోడేఘాట్ సాక్షిగా గెరిల్లా పోరాటం నడిపిన యోధుడు. ఆకుపచ్చని అడవిని రక్షించుకోవడానికి, అడవి బిడ్డల భూమి హక్కుల కోసం ప్రాణాలర్పించిన ఆయన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. జల్, జంగిల్, జమీన్ (నీరు, అడవి, నేల) అనే నినాదం కేవలం గిరిజనులకే కాకుండా, ప్రకృతిని, వనరులను కాపాడుకోవడానికి ప్రతీ పౌరుడికి స్ఫూర్తిదాయకం. భీమ్ చూపిన మార్గంలో నడుస్తూ, గిరిజనుల, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు, వారి సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేయడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి" అని పేర్కొన్నారు. తెలంగాణ సమాజం గర్వించదగ్గ వీరుడు కొమరం భీమ్ అని కొనియాడుతూ, ప్రజలందరికీ ఆయన జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# భూ రీ-సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేయాలి





### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి, అక్టోబర్ 22, (జనంసాక్షి)** భూ రీ–సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం బెల్లంపల్లి మండలం చాకపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల ప్రక్షాళన, సర్వే ప్రక్రియ అమలు, సర్వే పనులలో పారదర్శకత, ఖచ్చితత్వం తప్పనిసరిగా పాటించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, భూ రీ-సర్వే ప్రక్రియను సమర్థవంతంగా, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మనోజ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, తాండూర్ మండల తహసిల్దార్ జ్యోత్స్నలతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తాండూర్ మండల పరిధిలో చేపట్టిన భూ రీ-సర్వే పనుల పురోగతి, భూభారతి పథకం క్రింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై సమగ్రంగా సమీక్షించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. రైతులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు భూ రికార్డులకు సంబంధించిన సమస్యలను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా భూ రీ-సర్వే పనులను వేగవంతం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు, ప్రజలకు సత్వర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు



**చెన్నారావుపేట, అక్టోబర్ 22 ( జనం సాక్షి):** మండలంలోని పాపయ్యపేట గ్రామంలో ముదిరాజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఆయన జయంతి వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు ఉప్పరి అఖిల్, ఉపాధ్యక్షులు ఉప్పరి నేహంత్ కుమార్, ముఖ్య కార్యదర్శి ద్యాగల అశోక్, కోశాధికారి ముత్యాల చంద్రశేఖర్, చిట్టి అధ్యక్షులు అన్నబోయిన సునీల్, ఉపాధ్యక్షులు చెన్నూరి స్వామి, కోశాధికారి హంస వినోద్, ముఖ్య సలహాదారులు ఉప్పరి విక్రమ్, యూత్ సభ్యులు సూర నవీన్, ఉప్పరి అజయ్, అన్నబోయిన శేఖర్, అన్నబోయిన రాకేష్, అన్నబోయిన శ్రీను, కాట ప్రశాంత్, గోగుల అన్వేష్, అంగిరేకుల నవీన్, రవిచందు, నీలం అఖిల్, పాల్గొన్నారు.

# ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీమ్ 125వ జయంతి వేడుకలు



**పలిమెల, అక్టోబర్ 22 (జనం సాక్షి):** ఆదివాసీల ఆరాధ్య దైవం, విప్లవ వీరుడు కొమరం భీమ్ 125వ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆదివాసీ విద్యార్థి సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు మడే సత్యనారాయణ ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మడే సత్యనారాయణ మాట్లాడుతూ.. "జల్, జంగల్, జమీన్" అనే నినాదంతో నిజాం పాలకులను ఎదిరించి ఆదివాసీల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహా యోధుడు కొమరం భీమ్ అని కొనియాడారు. అడవే ఆదివాసీల జీవనాధారమని, అడవులు, భూముల పరిరక్షణ కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి ఆదివాసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని పేర్కొన్నారు. నిజాం సైన్యంతో చివరి శ్వాస వరకు పోరాడిన కొమరం భీమ్ జీవితం నేటి యువతకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఆదివాసీల హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన ఐదో షెడ్యూల్, పీసా చట్టం, 1/70 చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన విశ్వవిద్యాలయంలో ఆదివాసీ విద్యార్థులకు విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# బాసర ఫ్లైఓవర్ వద్ద తప్పని ప్రమాదాలు

### వేగనిరోధకాలపై స్థానికుల ఆగ్రహం



**బాసర, అక్టోబర్ 22 (జనం సాక్షి)** బాసరలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఫ్లైఓవర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఫ్లైఓవర్ దిగేచోట ఏర్పాటు చేసిన వేగనిరోధకాలు (స్పీడ్ బ్రేకర్లు) అత్యంత ఎత్తుగా ఉండటంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. తాజాగా నిజామాబాద్ జిల్లా, గుండారం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ముథోల్ వైపు వస్తుండగా, ఫ్లైఓవర్ చివరన ఉన్న వేగనిరోధకం వద్ద అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే ముథోల్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను అంబులెన్స్ సహాయంతో బాసర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇది ఒక్కసారి జరిగిన ఘటన కాదని, గత కొన్ని నెలలుగా ఇదే ప్రాంతంలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి, ఎత్తుగా ఉన్న వేగనిరోధకాలను తొలగించి సక్రమంగా ఏర్పాటు చేయాలని, ప్రమాదాలను నివారించేందుకు హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

# ధర్మ చక్ర పరివర్తన దినోత్సవం విజయవంతం చేయాలి



**జైనూర్, అక్టోబర్,22( జనం సాక్షి).** ధర్మచక్ర పరివర్తన దినోత్సవ విజయవంతం చేయాలని అసిఫాబాద్ లుంబిని దీక్ష భూమి సెంటర్ కమిటీ ప్రధాన కార్యదర్శి దుర్గే ప్రశాంత్ అన్నారు. గురువారం జైనూరు మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరీల అసోసియేషన్ సంఘ సభ్యులతో కలిసి గోడ ప్రతులను విడుదల చేశారు. ఈనెల 29న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు బౌద్ధ ధర్మాన్ని స్వీకరించిన రోజు పురస్కరించుకొని సెంటర్ కమిటీ ఆసిఫాబాద్ యందు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యాంగ రక్షణ ఫౌండర్ షాన్ రేంజర్ల రాజేష్, పాల్గొననున్నారని. ఈ కార్యక్రమాన్ని జయనూరు సిరిపూర్ లింగాపూర్ మండలాల నుంచి దళితులంతా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తుకారాం చునార్కర్, సింధే హేమంత్, పురుషోత్తం దుర్గే, మధుకర్ జాదే, జైనూరు మండల నాయకులు బాబాసాహెబ్ కాంబ్లే, సతీష్ గైక్వాడ్, పందరీ బందారే, అశోక్ కాంబ్లే, కాంబ్లే అమృత్, మాంగ్ సమాజ జిల్లా అధ్యక్షుడు మా వాళ్లే దత్త, కోటంబే శ్రీహరి. తదితరులు పాల్గొన్నారు.

# నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

### .మండల ఇన్‌చార్జి మాలోతు రమేష్ నాయక్

### ఎంపిడిఓకు వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 22 ( జనం సాక్షి ) :** నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ చిల్పూర్ మండల ఇన్‌చార్జి మాలోతు రమేష్ నాయక్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చిల్పూర్ ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల ఇన్‌చార్జి మాలోతు రమేష్ నాయక్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పంపిణీల లిస్టులో అర్హులైన పేదలకు అన్యాయం జరిగిందని, గుడిసెలు, పెంకు టిళ్లలో నివసిస్తూ సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు కాలేదని అన్నారు. నిజమైన పేదలను గుర్తించి, ఎలాంటి పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ డైరెక్టర్ బత్తుల రాజన్ బాబు,లింగంపల్లి కొండాపూర్,కృష్ణాజిగూడెం సర్పంచులు, వార్డు మెంబర్లు, గ్రామ అధ్యక్షులు, ఇన్చార్జులు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**నేరడిగొండ అక్టోబర్22(జనంసాక్షి)** :గ్రామ పిల్లలు యువకులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం రోజున మండలంలోని బుగ్గారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని,నిరుద్యోగ యువకుల సౌకర్యం కొరకు గ్రంథాలయం మంచి అవకాశం అని అన్నారు. చెడు వ్యాసనాలపై దృష్టి సారించకుండా ఉద్యోగం, చదువుపై ధ్యాస పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచులు కృష్ణ ఉప సర్పంచ్ జాదవ్ జల్పత్,రవీందర్ రెడ్డి వెంకట్రాం శ్రీకాంత్ గంగాధర్ నాయకులు రాథోడ్ సురేందర్ పాండు తదితరులు ఉన్నారు.

# అధైర్య పడద్దు అండగా నేనున్నా

## పిఎసిఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య



**మల్హర్, అక్టోబర్ 22(జనంసాక్షి)** మండల పరిధిలోని అద్వాల పల్లి గ్రామానికి చెందిన అన్నం కొమురయ్య బుధవారం రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలిసిన వెంటనే మృతుని కుటుంబ సభ్యుల పరామర్శించి అంత్యక్రియలలో పాల్గొన్న పిఎసి ఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడొద్దు. మీ కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని అన్నారు. వారికి ధైర్యం చెబుతూ అండగా నేనున్నానని ధైర్యం చెప్పిన పీఏసి ఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య. ఈ కార్యక్రమంలో అడు వాలపల్లి మాజీ సర్పంచ్ రాజు నాయక్, వివిధ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మాదారం టౌన్‌షిప్‌లో కొమురం భీమ్ జయంతి

## బిఆర్ఎస్ నేత అశోక్ కుమార్ నివాళులు



**తాండూర్, అక్టోబర్ 22(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లో ఆదివాసీల ఆరాధ్య దైవం, విప్లవ వీరుడు కొమురం భీమ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నేత జంగంపల్లి అశోక్ కుమార్ కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కుల కోసం, 'జల్-జంగిల్-జమీన్' నినాదంతో నైజాం సర్కారుపై అలుపెరగని పోరాటం చేసి అమరుడైన మహానీయుడు కొమురం భీమ్ అని కొనియాడారు. గిరిజనుల ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన భీమ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, వారి హక్కుల రక్షణకు తమ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గిరిజన నాయకులు, యువకులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రుద్రారంలో క్రికెట్ పోటీలు.. విజేతలకు బహుమతులు

## సర్పంచ్ చంద్రగిరి సంపత్



**మల్హర్, అక్టోబర్ 22 (జనంసాక్షి)** దసరా పండుగను పురస్కరించుకుని మండలంలోని రుద్రారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు గురువారం నగదు బహుమతులు అందజేశారు. రుద్రారం సర్పంచ్ చంద్రగిరి సంపత్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బడితల రాజయ్య ఆధ్వర్యంలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.5,000, ద్వితీయ బహుమతిగా రూ.2,500 అందజేశారు. దసరా పండుగ వేళ క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా యువతలో క్రీడాస్ఫూర్తి, ఐక్యత పెంపొందుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గాదె గట్టయ్య, భాషిక అశోక్, కాంగ్రెస్ నాయకులు మోత్కూరి మహేష్, కొమ్మెర స్వామి, కొమ్మెర రమేష్, కొమ్మెర తిరుపతి, పగడాల రమేష్, సభావట్ శ్రీను నాయక్, అజ్మీర రాజేందర్, క్రీడాకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సైకి ముదిరాజ్ కులస్తుల ఘన సన్మానం




**పర్వతగిరి, అక్టోబర్ 22, (జనం సాక్షి)** వరంగల్ జిల్లా, పర్వతగిరి పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాజ్‌కుమార్‌ను ముదిరాజ్ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై రాజ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ.. పర్వతగిరి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎస్సై రాజ్‌కుమార్ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రావుల రాజు, ఉపాధ్యక్షులు అల్లాడి ఎల్లస్వామి, ధోని దేవేందర్, టౌన్ అధ్యక్షుడు నిరటి వెంకన్న ముదిరాజ్, ఏఎంసీ జిల్లా డైరెక్టర్ గొడుగు బిక్షపతి ముదిరాజ్, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ అల్లాడి నరసయ్య ముదిరాజ్, మండల యువజన అధ్యక్షుడు పిట్టల రాజు ముదిరాజ్, మండల కార్యదర్శి గుర్రం యాదగిరి, పులుగుజ్జు రాజు, టౌన్ ఉపాధ్యక్షుడు కొండ వెంకటేశ్వర్లు, యువజన కార్యదర్శి నిరటి రమేష్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల మత్స్యశాఖ అధ్యక్షులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌కు స్వస్తి.. పారిశుధ్యానికి పెద్దపీట

## సిర్గాపూర్‌లో స్టీల్ బ్యాంక్ ప్రారంభం న్యూ లోలంలో చెత్తబుట్టల పంపిణీ





**దిలావర్‌పూర్, అక్టోబర్ 22 (జనం సాక్షి):** మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ చర్యలను జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. సిర్గాపూర్‌లో స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించగా, న్యూ లోలంలో చెత్తబుట్టలను పంపిణీ చేశారు. సిర్గాపూర్‌లో స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించిన డీపీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో శుభకార్యాలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా స్టీల్ పాత్రలను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, స్టీల్ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం న్యూ లోలంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించి, గ్రామస్తులకు చెత్తబుట్టలను పంపిణీ చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పంచాయతీ సిబ్బందికి అందించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గోవర్ధన్, సిర్గాపూర్ సర్పంచ్ చైతన్య శంకర్‌రెడ్డి, న్యూ లోలం సర్పంచ్ శ్రీలత సాయన్న, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వరంగల్ నగర భవిష్యత్తు అభివృద్ధి కోసమే రోడ్ల విస్తరణ

## ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నగర అభివృద్ధిని అడ్డుకోవద్దు

## రూ.2 కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ, ప్రతినిధి అక్టోబర్ 22 (జనం సాక్షి)** :వరంగల్ నగర భవిష్యత్తు అభివృద్ధి, ప్రజల సౌకర్యాలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ బస్టాండ్ నుంచి జేఎన్ఎస్ స్టేడియం మీదుగా డీసీసీ భవన్ వరకు సుమారు రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ.. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల సంఖ్యతో రోడ్లపై ట్రాఫిక్ తీవ్రంగా పెరుగుతోందని, అనేక ప్రాంతాల్లో బంపర్ టు బంపర్ ట్రాఫిక్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాతకాలం నాటి రహదారులు ప్రస్తుత జనాభా, వాహనాల అవసరాలకు సరిపోవడం లేదని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నగర అభివృద్ధిని పక్కన పెట్టడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. నేటి నిర్ణయాలు రేపటి తరాలకు ఉపయోగపడేలా ఉండాలని, మన పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నగర అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను రాజకీయ కోణంలో చూడకుండా, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అర్థం చేసుకోవాలని సూచించారు. హనుమకొండ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో రోడ్డు ఇరుకుగా ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు, స్థానిక వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్టాండ్‌ను అభివృద్ధి చేయడంతో పాటు దానికి అనుసంధానంగా ఉన్న రహదారులను కూడా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే బస్టాండ్ నుంచి జేఎన్ఎస్ స్టేడియం మీదుగా డీసీసీ భవన్ వరకు రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. గతంలో రోడ్లపైకి భవనాలు, దుకాణాలు విస్తరించేలా అనుమతులు ఎలా ఇచ్చారో ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రహదారుల విస్తరణకు ఆటంకాలు కలిగించే నిర్మాణాల వల్ల నగర అభివృద్ధికి నష్టం జరుగుతోందని అన్నారు. గతంలో సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల ఏర్పడిన సమస్యలను ఇప్పుడు సరిచేయడానికి సమయం, శ్రమ అవసరమవుతున్నాయని తెలిపారు. గతంలో ఈ రహదారిపై అనేక గుంతలు ఉండేవని, వాటి కారణంగా వాహనదారులు, ప్రజలు ప్రమాదాలకు గురై ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం రోడ్లను మెరుగుపరచి, విస్తరించి, ప్రజలకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. స్టేడియం వైపు ఉన్న హాస్టళ్లలో నివసించే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా, వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. రహదారుల విస్తరణ, వాణిజ్య అభివృద్ధి, క్రీడా మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంక్షేమం వంటి అంశాలను సమన్వయం చేసుకుంటూ నగరాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు.

# భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి పక్కా ప్రణాళిక రూపొందించాలి

### పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి

### పాత భూభారతి దరఖాస్తులకు నవంబర్ 15 గడువు

### కొత్త దరఖాస్తులను 30 రోజుల్లోగా పరిష్కరించాలి భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్





**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 22(జనంసాక్షి).** భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి పక్కా ప్రణాళిక రూపొందించి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ జిల్లా అదనపు కలెక్టర్లను ఆదేశించారు. గురువారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూముల రీ సర్వే, బృందాల ఏర్పాటు, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, హైకోర్టు కేసులు, భూసేకరణ, ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 59 కింద క్రమబద్ధీకరణ దరఖాస్తులు, భూదాన్ భూములపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ కుమార్ మాట్లాడుతూ పాత భూభారతి విధానంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ నవంబర్ 15లోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. కొత్త భూభారతి విధానంలో అందే దరఖాస్తులను స్వీకరించిన తేదీ నుంచి 30 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులను పాటించాలని సూచించారు. రీ సర్వే పురోగతి, ఇందుకు అవసరమైన బృందాల ఏర్పాటుపై సమీక్షించారు. రీ సర్వే పనులు సక్రమంగా సాగేందుకు బృందాల ఏర్పాటుపై దృష్టి సారించాలని తెలిపారు. భూదాన్ భూములు, భూసేకరణ అంశాలు, హైకోర్టు కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 59 కింద పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణ దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, డిప్యూటీ తహసీల్దార్ నితీష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పుల్లూరు దిలీప్ గౌడ్ కుటుంబాన్ని ఆర్థిక సహాయం చేసినా పర్వతగిరి గౌడ సంఘం



**పర్వతగిరి అక్టోబర్ 22 జనం సాక్షి** మండల కేంద్రంలో అనారోగ్యంతో చనిపోయిన కీర్తిశేషులు పుల్లూరు దిలీప్ గౌడ్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేసిన పర్వతగిరి గౌడ సంఘం, మేషనేని సరోజన: పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన పుల్లూరి దిలీప్ గౌడ్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పర్వతగిరి గౌడ సంఘం 26,500 రూపాయలు, మేషినేని సరోజనా 10,000 రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో మేచినేని వంశీ, పర్వతగిరి గౌడ సంఘం అధ్యక్షుడు తీగల వీరస్వామి గౌడ్, ఉపాధ్యక్షుడు కక్కర్ల యాకాంరం గౌడ్, కార్యదర్శి మడ్డి వెంకన్న గౌడ్, గిరిగాని యాకన్న గౌడ్, రంగు జనార్దన్ గౌడ్, రంగు కుమార్ గౌడ్ మాజీ ఎంపీపీ, రంగు కుమార్ గౌడ్ ఫర్టిలైజర్, రావూర్ మాజీ, సర్పంచ్ బండి సంతోష్ గౌడ్, డైరెక్టర్లు చీకటి యాకన్న గౌడ్, ముంజ శ్రావణ్ గౌడ్, చిర్రా శేఖర్ గౌడ్, బందారపు రంజిత్ గౌడ్, తాళ్లపల్లి వెంకన్న గౌడ్ దయాకర్ గౌడ్ సమ్మసాయిల గౌడ్ బైరి రాజశేఖర్, దుబాయ్ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# గణన ప్రాంతాల గుర్తింపుపై అధికారులకు శిక్షణ



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 22(జనంసాక్షి).** జనాభా గణన--2027 రెండవ దశ నిర్వహణకు సంబంధించి అక్టోబర్ 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్. మహేందర్ గురువారం ప్రారంభించారు. ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జనాభా గణన రెండవ దశలో గణన బ్లాకులు, ఉప గణన బ్లాకుల ఏర్పాటుపై హైదరాబాద్ నుంచి వచ్చిన జనగణన శాఖ అధికారులు విహేందర్ బాబు, నాయుడు శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమం లో ఆర్డీఓ కృష్ణవేణి, ముఖ్య ప్రణాళిక అధికారి ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులు, జిల్లా అధికారులు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, గణాంక అధికారులు, ఈడీఎం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వరంగల్ కలెక్టరేట్లో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు



**వరంగల్ బ్యూరో అక్టోబర్ 22( జనం సాక్షి)** వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పండుగ సాయన్న ముదిరాజ్ జీవిత చరిత్ర, ధైర్యసాహసాలు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు .పండగ సాయన్న 1860 -1900 మధ్య కాలానికి చెందిన వారు అని, వారు దానధర్మాలు చేసి ప్రజా నాయకుడిగా ప్రజల గుండెల్లో గుర్తింపు పొందారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ పండుగ సాయన్న గారి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. వారు గ్రామీణ క్రీడల్లో ఆరితేరిన వారిగా వారి జీవిత చరిత్ర చెబుతుందన్నారు. ఈ సందర్భంగా మేర కార్పొరేషన్ చైర్మెన్ వెంకట్రాజం మాట్లాడుతూ పండుగ సాయన్న జయతి ఉత్సవాలను అధికారికంగా జరుపుకోవడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు (రెవెన్యూ, స్థానిక సంస్థలు), ఉప సంచాలకులు ఎ. పుష్పలత, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కె. శంకరయ్య, సంబంధిత జిల్లా అధికారులతో పాటు ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, మెపా ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు వ్యవస్థాపక సభ్యులు బోనాల రమేష్, పులి రజనీకాంత్, చొప్పరి సోమయ్య, శానబోయిన రాజ్ కుమార్, పొన్నం మొగిలి, బండి సారంగపాణి, పులి రాజేష్, నవీన్, అమర్, పులి విక్రం, శ్రవణ్, మెపా హనుమకొండ జిల్లా అధ్యక్షులు పులి రాజేష్, ఉపాధ్యక్షులు గోనెల విజేందర్, ఆళ్ల నరేష్, గంట వినోద్ కుమార్, శిరబోయిన సతీష్, మండల సమ్మయ్య, గంగరబోయిన కిరణ్, అరవింద్, ప్రశాంత్, ఆకుల సుభాష్, శ్రవణ్, విక్రమ్ వివిధ మండలాల అధ్యక్షులు కార్యదర్శిలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఇస్తున్న శిక్షణకు హాజరైన చిన్న పెండ్యాల సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మ



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 22 ( జనం సాక్షి ) :** తెలంగాణ ప్రభుత్వం, పంచాయతీ రాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు, గ్రామ సభల నిర్వహణలో సామర్థ్య పెంపు అనే అంశంపై మహిళా ప్రజాప్రతి నిధులకు హైదరాబాద్ డాక్టర్ ఎంసిఆర్,హెచ్ ఆర్ డిఐలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఎంపికైన చిల్పూర్ మండలంలోని చిన్న పెండ్యాల గ్రామ సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మ మూడురోజుల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ఈ శిక్షణ కార్యక్రమానికి తాను ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

# ఘనంగా కొమరం భీమ్ జయంతి వేడుకలు

### విగ్రహానికి పూలమాలలు వేసిన ఆదివాసీ నాయకులు షెడ్యూల్ చట్టాలను అమలు చేయాలి

### ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఆదివాసీ సంఘాల నాయకులు



**నూగూర్ వెంకటాపురం అక్టోబర్ 22(జనం సాక్షి ):-** ఆదివాసీల ఆరాధ్య దైవం నిజాం నిరంకుశ విధానాలను ఎదిరించి పోరాడి అమరుడైన కొమరం భీమ్ జయంతి వెంకటాపురం మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కొమరం భీమ్ విగ్రహానికి నాయకులు పూనెం సాయి, కొర్స నర్సింహా మూర్తి, వాసం నాగరాజు, పర్శిక సతీష్, పూనెం ప్రతాప్ పూలమాలలు వేసినారు. కొమరం భీమ్ భూమి, నీరు, అడవిల పైన ఆదివాసీలకు హక్కులు కల్పించాలని నిజాం ప్రభుత్వంతో అలుపెరుగని పోరాటం చేసినట్టు నాయకులు తెలిపారు. కొమరం భీమ్ పోరాటం వల్లనే నేడు ఆదివాసీలకు చట్టబద్ధమైన హక్కులు లభించాయని అన్నారు. నేడు ఆ చట్టాలు అమల్లో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నట్టు వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమరం ఆశయ సాధనకు ఆదివాసీలు పాలక ప్రభుత్వాల పైన పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల పైన అణచివేత విధానాలు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిజాం విధానాలను అనుసరిస్తున్నట్టు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు కొమరం ఆశయాలను సాధిద్దాం అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంజ మహేష్ కంతి విజయ్ , వాసం నారాయణ, కంతి శంకర్, ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన ఎస్సై సీహెచ్. రాజుకు
## కాంగ్రెస్ గిరిజన నాయకుల ఘన సన్మానం
### శాంతిభద్రతల పరిరక్షణతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



**దేవరుప్పుల, అక్టోబర్ 22 (జనం సాక్షి):** దేవరుప్పుల మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్. రాజును మండల కాంగ్రెస్ పార్టీ గిరిజన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సైకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, మండలంలో శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షించడంతో పాటు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి భానోత్ భాస్కర్ నాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు సజ్జన్ నాయక్, సర్పంచులు లకావత్ భాగ్య నాయక్, బానోత్ మహేందర్ నాయక్, ధరావత్ అనిత--రవీందర్ నాయక్, బానోత్ సుధాకర్ నాయక్, ధరావత్ సుజాత--యాకన్న నాయక్, ఉప సర్పంచ్ జరుప్ల శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొని నూతన ఎస్సైకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్సై ప్రవీణ్ సార్‌ను కలిసి సత్కరించిన స్వేరోస్




**పర్వతగిరి అక్టోబర్ 22 జనం సాక్షి** పర్వతగిరి మండలంలో సబ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వర్తించి వర్ధన్నపేటకు బదిలీపై వెళ్లిన బోగం ప్రవీణ్ సార్‌ని స్వేరోస్ నాయకులు వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా స్వేరోస్ నాయకులు మాట్లాడుతూ ప్రవీణ్ సార్ తన విధినిర్వహణలో అందరి మన్ననలను పొందారని తన విశిష్టమైన సేవల ద్వారా అందరి అభిమానాన్ని చూరగొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ నాయకులు జిల్లా అధ్యక్షులు కందికట్ల ప్రవీణ్ జోనల్ నాయకులు జంగిలి యాకయ్య జిల్లా నాయకులు గారె జయరాజ్, చెడుపాక సిద్దు, మధు, గోగుల బాబు, గణేష్, మహేష్, అభి పాల్గొన్నారు.

## మల్లారం సర్పంచ్ రాజయ్య యాదవ్‌కు పితృవియోగం
### మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగిడి శ్రీనివాస్, ఫాక్స్ చైర్మన్ ఇప్ప మొండయ్య,
### మాజీ ఎంపీపీ మలహల్ రావు.. సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కొండ రాజమ్మ



**మల్హార్, అక్టోబర్ 22 (జనంసాక్షి)** మండలంలోని మల్లారం గ్రామ సర్పంచ్ మేకల రాజయ్య యాదవ్ తండ్రి మేకల అప్పయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లారం గ్రామానికి చేరుకుని అప్పయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ రాజయ్య యాదవ్, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు ఆదేశాల మేరకు మల్హార్‌రావు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎడ్లపల్లి సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని జంగిడి శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. మాజీ ఎంపీపీ చింతలపల్లి మలహల్ రావు, ఫాక్స్ చైర్మన్ ఇప్ప మొండయ్య సైతం అప్పయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించి, సర్పంచ్ రాజయ్య యాదవ్‌ను పరామర్శించారు. అధైర్యపడవద్దని, కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచిస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కొండ రాజమ్మ, తాడిచర్ల సర్పంచ్ బండి స్వామి, మల్హార్‌రావు మండల యూత్ అధ్యక్షుడు, చిన్నతూండ్ల సర్పంచ్ గడ్డం క్రాంతి రణదేవ్, కొండంపేట సర్పంచ్ జ్యోత్స్న సరీన్ రావు, సర్పంచ్ రజీత రమేష్‌రెడ్డి, ఇప్పలపల్లి సర్పంచ్ లింగస్వామి, మల్లారం గ్రామ శాఖ అధ్యక్షుడు రాజు నాయక్, కాంగ్రెస్ జగన్ నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు పండుగ సాయన్న
### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 22, జనం సాక్షి** పెత్తందారులు, భూస్వాములు, జమీందారీ వ్యవస్థతో పాటు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన తెలంగాణ ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న జయంతి వేడుకలకు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల అణచివేతను ఎదిరించి పోరాడిన ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని తెలిపారు. తెలంగాణ ప్రజావీరుడుగా, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. సమాజంలోని పేద ప్రజల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమానికి కృషి చేశారని, ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన పండుగ సాయన్న సేవలు చిరస్మరణీయమని తెలిపారు. సమాజంలోని పేద ప్రజల సంక్షేమానికి తోడ్పడిన ఇలాంటి మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. మహనీయులు చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో సమానత్వం, సేవాభావం, పేదల పట్ల మానవత్వం పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా పరిషత్ సిఈఓ గణపతి, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## భూ భారతి, రీ-సర్వే, ఓటరు జాబితా సవరణ పనులను వేగవంతం చేయాలి
### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 22, జనం సాక్షి** భూ భారతి, రీ-సర్వే, ఓటరు జాబితా సవరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ సంతోష్ కుమార్‌తో కలిసి ఉద్యోగులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని, కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. సాదా బైనామా, భూ భారతి దరఖాస్తుల పరిశీలన, రీ-సర్వే ప్రక్రియ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పనుల పురోగతిపై సమీక్షించారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. హాజీపూర్ మండల పరిధిలోని వేంపల్లి గ్రామంలో మండల తహసిల్దార్ పుష్పలతతో కలిసి భూ భారతి, రీ-సర్వే, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్** మండలంలోని గుడిపేట గ్రామ రైతు వేదికలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన వ్యవసాయ మార్కెటింగ్, పత్తి మార్కెటింగ్, మద్దతు ధరలపై అవగాహన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు. రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాలు, పత్తి విక్రయాలు, మద్దతు ధరలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర మంత్రి పలు సూచనలు చేశారు. రైతులకు ప్రభుత్వ మార్గదర్శకాలు, మార్కెటింగ్ సంబంధిత సమాచారాన్ని చేరవేయాలని అధికారులకు సూచించారు.

## ఎస్పీని కలిసిన తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కమిటీ
### పుష్పగుచ్ఛం అందించి కమిటీకి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ



**ములుగు ప్రతినిధి,అక్టోబర్ 22(జనం సాక్షి):-** ఇటీవల ములుగు జిల్లాలో నూతనంగా ఏర్పడిన తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టిజెఎ) జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు గురువారం ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్ నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన(టిజెఎ )కార్యవర్గ సభ్యులకు పుష్పగుచ్ఛం అందించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఎస్పీ తన ఛాంబర్‌లో టీజేఏ కమిటీ సభ్యులతో కాసేపు ముచ్చటించటం తోపాటు జిల్లాలో జర్నలిస్టుల సమస్యలు, మీడియా భద్రత, సమాచార అందుబాటు వంటి అంశాలపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో నిజాలను నిర్భయంగా ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. చట్ట పరిధిలో జర్నలిస్టులు తమ విధులు నిర్వర్తించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మీడియా, పోలీస్ శాఖ కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు. తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ ములుగు జిల్లా నూతన కమిటీకి ఆయన అభినందనలతో పాటు ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఎలాంటి సమస్య ఉత్పన్నమైన వెంటనే తన ద్రుష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ నూతన కమిటీ ఎస్పీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు కృతజ్ఞతలు తెలియజేసారు. ములుగు జిల్లా ఎస్పీ ని కలసిన వారిలో తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బేతి సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల కొమురయ్య, ఉపాధ్యక్షులు చల్లగురుగుల రాజు, కోశాధికారి సంఘ రంజిత్ కుమార్, సభ్యులు బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు పీహెచ్‌సీలో

## ఎల్‌సీడీసీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించిన డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య




**ఆత్మకూరు, అక్టోబర్ 22 జనం సాక్షి** కుష్టు వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సమిష్టిగా కృషి చేయాలని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఏ. అప్పయ్య విజ్ఞప్తి చేశారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా హనుమకొండ జిల్లా ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో చేపట్టిన లెప్రసీ కేసుల గుర్తింపు ప్రచార కార్యక్రమం సర్వేను గురువారం డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య ప్రారంభించి మాట్లాడుతూ, కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి బాధితులకు సకాలంలో చికిత్స అందించడం ద్వారా వ్యాధి వల్ల కలిగే వైకల్యాలను నివారించడంతో పాటు వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలిపారు. సర్వేలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించాలని, అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వైద్య పరీక్షల నిమిత్తం సంబంధిత ఆరోగ్య కేంద్రాలకు పంపించాలని సూచించారు. కుష్టు వ్యాధి సోకిన వారిలో సాధారణ చర్మపు రంగు కంటే తక్కువ రంగు లేదా రాగి రంగులో మచ్చలు కనిపించవచ్చని, ఆ మచ్చలపై స్పర్శ జ్ఞానం తగ్గడం లేదా లేకపోవడం ప్రధాన లక్షణమని వివరించారు. వ్యాధి నరాలను ప్రభావితం చేసినప్పుడు చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, బలహీనత, స్పర్శ జ్ఞానం కోల్పోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చని తెలిపారు. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కుష్టు వ్యాధికి సంబంధించిన పరీక్షలు, చికిత్స ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వ్యాధిపై భయాందోళనలు విడనాడాలని, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా వారికి అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సర్వేను సమర్ధవంతంగా నిర్వహించాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. సర్వేలో గుర్తించిన అనుమానిత కేసులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా ఉచిత చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ టి. మదన్ మోహన్ రావు మాట్లాడుతూ, కుష్టు వ్యాధి మైకోబాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని తెలిపారు. ఈ వ్యాధి లక్షణాలు బయటపడటానికి సాధారణంగా మూడు నుంచి ఐదు సంవత్సరాలు పట్టవచ్చని వివరించారు. కుష్టు వ్యాధి వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి కాదని, అది శాపం లేదా పాపం వల్ల వచ్చే వ్యాధి కాదని స్పష్టం చేశారు. బహుళ ఔషధ చికిత్స ( ఎండిటి ) ద్వారా కుష్టు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని, వ్యాధి రకాన్ని బట్టి సాధారణంగా ఆరు నుంచి పన్నెండు నెలల పాటు చికిత్స తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కుష్టు వ్యాధి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న ఎల్‌సీడీసీ సర్వేకు ప్రజలందరూ సహకరించి, ఆరోగ్య సిబ్బందికి అవసరమైన సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ టి. మదన్ మోహన్ రావు, ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్పందన, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, డీపీఎంఓలు రవీందర్, ఎల్లయ్య, దేవ్ సింగ్, సీహెచ్ఓ జునేధి, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పండుగ సాయన్న జయంతి ఉత్సవాలు




**మావల అక్టోబర్ 23( జనం సాక్షి):** జిల్లా కేంద్రంలో గురువారం పండుగ సాయన్న జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది. వేడుకల్లో భాగంగా ద్వారకానగర్ రోడ్ లోని పండుగ సాయన్న విగ్రహానికి, కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయన్న చిత్రపటానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎంపీ గోడం నగేష్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష ముఖ్య అతిథులుగా హాజరై నివాళులు అర్పించి స్మరించుకున్నరు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్ణయం మేరకు పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రతి జిల్లాలో అధికారికంగా నిర్వహించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. యువకులు, విద్యార్థులు పండుగ సాయన్న జీవిత చరిత్రను తెలుసుకొని, వారి బోధనలను నిత్య జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాల కోసం, అణచివేతకు వ్యతిరేకంగా పండుగ సాయన్న చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా ఎస్సై, కానిస్టేబుల్, ఫౌండేషన్ కోర్సులకు దాదాపు 200 మందికి పైగా యువతకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, మత్స్యకార సంఘాల నాయకులు లేవనెత్తిన స్థలాలు, షెడ్లు, మత్స్యకార సొసైటీల సమస్యలు, చెరువులు, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపు తదితర అంశాలపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమస్యలను సంబంధిత డిపార్ట్‌మెంట్ల వారీగా సమీక్షించి, డీఎస్సీడీఓ సహకారంతో త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ, చరిత్రలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, వారి హక్కుల పరిరక్షణకు పాటుపడిన గొప్ప నేత పండుగ సాయన్న అని కొనియాడారు. గతంలో పేద, చిన్న వర్గాల పక్షాన నిలిచి, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎదిరించిన వారిని కొందరు తీవ్రవాదులుగా ముద్ర వేసేవారని గుర్తుచేశారు. సమాజంలో మార్పు కోసం శ్రమించిన వారి జీవిత చరిత్రలను అధ్యయనం చేసి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళితే తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. సాయన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, ఆయనను అధికారికంగా గుర్తించడం ఎంతో సంతోషకరమని ఎంపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి బిసి సంక్షేమ అధికారి సునీత కుమారి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాములు, రవి, బిసి సంఘాల ప్రజాప్రతినిధులు శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి



**గోవిందరావుపేట: అక్టోబర్22( జనం సాక్షి)** మండల కేంద్రానికి చెందిన యువకుడు ఈనెల 18వ తారీఖున 163 వ జాతీయ రహదారి మీద చల్వాయి గోవిందరావుపేట గ్రామాల మధ్య రెండు బైకులు ఢీకొని మృతి చెందిన ఘటన గోవిందరావుపేట గ్రామంలో తీవ్ర విషాదం నెలకొన్నది. స్థానికుల కథనం ప్రకారం ఈనెల 18వ తారీఖున ఉదయం సుమారు 8 గంటల సమయాన చల్వాయి నుండి గోవిందరావుపేట వస్తున్న క్రమంలో ఎదురుగా ఎదురెదురూ గా రెండు బైకులు ఢీకొనగా తీవ్ర గాయాలైన సమీర్ 18 సంవత్సరాలు ని హుటాహుటిగా 108 అంబులెన్స్ ద్వారా ఎంజీఎం ఆసుపత్రి కి తరలించినారు. మూడు రోజుల నుండి చికిత్స అందిస్తుండగా గురువారం ఉదయం 1:00 కు మృతి చెందడం జరిగింది. సమీర్ మృతితో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## జిల్లాలో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 22(జనంసాక్షి).** జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం శ్రీ పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి బి రామ్మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్ రావు ముఖ్య అతిథిగా హాజరై, శ్రీ పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంపత్ రావు మాట్లాడుతూ, శ్రీ పండుగ సాయన్న ముదిరాజ్ పేద ప్రజల సంక్షేమం కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప ప్రజానాయకుడని పేర్కొన్నారు. ఆయన ధైర్యసాహసాలు, ప్రజల పట్ల అంకితభావం, సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొల్లు దేవేందర్ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు, ఏర్ల వెంకన్న ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు, అచ్చునూరి కిషన్ ముదిరాజ్ మేపా జిల్లా అధ్యక్షుడు, సనబోయిన అశోక్ ముదిరాజ్ సామజిక ముదిరాజ్ న్యాయవేధిక రాష్ట్ర అధ్యక్షుడు, వీరబోయిన రాజేందర్, పులుగుజ్జు వెంకన్న, భుమ నరేష్ , మరబోయిన రవీందర్, మరియు ముదిరాజ్ సంఘ నాయకులు మరియు బిసి సంక్షేమ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మిక కుటుంబాన్ని పరామర్శించిన గౌడ కులస్తులు



**ఎల్క్ తుర్తి అక్టోబర్ 22(జనంసాక్షి) :** ఇటీవలమరణించిన గౌడ గీత కార్మిక కుటుంబాలను గురువారం కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యవర్గం సభ్యులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎల్కతుర్తి గ్రామంలో మండల కల్లుగీత కార్మిక ఉపాధ్యక్షుడు శ్రీపతి సదానందం గౌడ్ కుమారస్వామి గౌడ్, తల్లి శ్రీపతి రాజమ్మ దశదిన కార్యక్రమానికి హాజరై స్వగృహంలో కుటుంబాన్ని పరామర్శించి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌని సాంబయ్య, జిల్లా అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సమయంలో భగవంతుడు వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మండల అధ్యక్షులు జనగాని లక్ష్మీనారాయణ గౌడ్, గౌరవ సలహాదారుడు గొడిశాల యాదగిరి గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హసన్ పర్తి మండల అధ్యక్షులు మోటపోతుల రాజు గౌడ్, పంజాల సాంబరాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, జనగాని ప్రవీణ్ గౌడ్, జనగాని సురేష్ గౌడ్, కందాల నగేష్ గౌడ్, గీతా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా గణనలో ఛార్జ్ అధికారుల పాత్ర కీలకం

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22(జనంసాక్షి ):** జనాభా గణన చార్జ్ అధికారుల పాత్ర కీలకమైనదని, జనాభా గణనలో ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భావన సమావేశ మందిరంలో కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరితో కలిసి తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జనాభా గణన ప్రక్రియలో తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు చార్జ్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. జనాభా గణన ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చార్జ్ అధికారులు వ్యవహరించాలని తెలిపారు. ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జరిగే జనాభా గణన ప్రక్రియ 2 విడతలుగా ఉంటుందని, మొదటి విడతలో నివాస గృహాల గణన, 2వ విడతలో జనాభా గణన ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని, శిక్షకులు చెప్పే ప్రతి అంశాన్ని నోట్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి గురువయ్య, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కాలరీస్ కొత్తగూడెం జనరల్ మేనేజర్ (సివిల్) శ్రీ ఆర్. సతీష్ బాబుకు ఘన సన్మానం







**తాండూర్, అక్టోబర్ 22(జనం సాక్షి)** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెం జనరల్ మేనేజర్ (సివిల్)గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ ఆర్. సతీష్ బాబు గారు తొలిసారిగా మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి ఏరియా గోలేటికి విచ్చేసారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా సివిల్ కాంట్రాక్టర్ల తరఫున ఆయనను ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో సివిల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఎస్.ఈ శ్రీధర్, ఏ.ఈ క్రాంతితో పాటు సివిల్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. అలాగే జీఎంను సన్మానించిన వారిలో సివిల్ కాంట్రాక్టర్లు ముక్కు గోపికృష్ణారెడ్డి, శివారెడ్డి, అల్లాడి రాజేష్, తోలేటి తిరుపతి, రామగౌని మహిధర్ గౌడ్, ముత్యాల పైడిధర్, పరకాల సాగర్ గౌడ్, మోడెం నర్సాగౌడ్, కామణి శ్రీనివాస్, మొండయ్య, దుర్గారావు, సుధాకర్, రమేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

నస్పూర్ **అక్టోబర్ 22(జనం సాక్షి):** నస్పూర్‌కి చెందిన విద్యార్థి శ్రీపతి రాహుల్ (22) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నెల 20న రాత్రి నస్పూర్ నుంచి మంచిర్యాల వైపు బైక్‌పై వెళ్తుండగా నస్పూర్ పీహెచ్‌సీ ఎదురుగా జాతీయ రహదారి-63పై డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి బాబాయి సురేష్ ఫిర్యాదు మేరకు సీసీసీ నస్పూర్ ఎస్ఐ ఎం.డి. తహసీనుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# లెప్రసీ సర్వేకు గతంలో మాదిరిగానే అదనపు పారితోషికం చెల్లించాలి

## గత సర్వేల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి: వెలిశాల క్రిష్ణమాచారి

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22(జనంసాక్షి ):** జిల్లాలో గురువారం నుంచి ప్రారంభమయ్యే లెప్రసీ సర్వేకు ప్రభుత్వం గతంలో చెల్లించిన విధంగానే ఆశా వర్కర్లకు అదనపు పారితోషికం చెల్లించాలని, గతంలో నిర్వహించిన లెప్రసీ సర్వేలకు సంబంధించిన పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెలిశాల క్రిష్ణమాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లెప్రసీ సర్వే నిర్వహించే ప్రతిసారీ ఆశా వర్కర్లకు అదనపు పారితోషికం చెల్లింపు విషయంలో సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. గతంలో ప్రభుత్వం చెల్లించిన విధంగా ఈసారి కూడా అదనపు డబ్బులు చెల్లించాలా లేదా అనే గందరగోళం నెలకొనడం వల్ల సర్వే నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్య కారణంగా లెప్రసీ సర్వే సకాలంలో పూర్తికాకుండా ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ఆశా వర్కర్లు ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రభుత్వం అప్పగించే అదనపు విధులను నిర్వహిస్తున్నప్పటికీ వారికి రావాల్సిన పారితోషికాలు సకాలంలో అందకపోవడం అన్యాయమని అన్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి, గతంలో ఇచ్చిన విధంగానే ఈ లెప్రసీ సర్వేకు అదనపు పారితోషికం చెల్లించాలని, గత సర్వేల పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్



చేశారు. భవిష్యత్తులో ఇలాంటి గందరగోళం పునరావృతం కాకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీ ఏం అండ్ హెచ్ ఓ )కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంపై స్పందించిన జిల్లా వైద్యాధికారి, సమస్యల పరిష్కారానికి పైస్థాయి అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నగరం పద్మ, జిల్లా నాయకులు అనిత, సుకన్య, గౌరుబాయి, ఓమల, సునీత, శోభా, శోభాలక్ష్మి, కేసరి, మంజుల, సూర్యకాంత, సులోచన, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాల్లో బీజేపీవార్డు సభ్యురాలికి అవమానం!

## సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారికి ఫిర్యాదు

మహాదేవపూర్, అక్టోబర్ 22 (జనంసాక్షి): మహాదేవపూర్ మండల కేంద్రంలో మంగళవారం జరిగిన దసరా ఉత్సవాల్లో బీజేపీ పార్టీ వార్డు సభ్యురాలుకు ఆహ్వానించక పోవడంపై అవమానించేలా వ్యవహరించడం జరుగుతుందని పేర్కొంటూ మండల బిజేపీ అధ్యక్షులు రాంశెట్టి మనోజ్ మండల పరిషత్ అధికారికి ఫిర్యాదు చేయడంజరిగింది. బీజేపీ మహిళా వార్డు సభ్యురాలి ఫొటోను స్క్రీన్‌పై ప్రదర్శించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల మధ్య పార్టీ వివక్ష చూపడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. దసరా పవిత్రమైన పండుగ ప్రజలందరూ రాజకీయ భేదాలు లేకుండా కలిసిమెలిసి జరుపుకోవసిన దసరా పండుగని అలాంటి సందర్భాల్లో రాజకీయలకు తావు ఇవ్వకూడదని ప్రజలచే ఎన్నుకోబడిన వార్డు సభ్యుడికి సమాన గౌరవం ఇవ్వాలని అన్నారు. దసరా ఉత్సవాల్లో చోటుచేసుకున్న పరిణామాలపై అధికారులు నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బిజేపి పార్టీ అధ్యక్షులు మనోజ్ మాట్లాడుతూ దసరా పండుగ హిందూ సంస్కృతి,



సంప్రదాయాలకు ప్రతీక అని, చెడుపై మంచి సాధించిన విజయానికి నిదర్శనమని మనోజ్ పేర్కొన్నారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కించపరిచే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తే సహించబోమని బీజేపీ నాయకులు దసరా ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి జనగామ పోచయ్య, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బల్ల శ్రావణ్ కుమార్, బీజేపీ నాయకులు దాడిగేలా వెంకటేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# 4వ బెటాలియన్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

## పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వ్యాస రచన పోటీలు

**వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 202 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, బహుజన విప్లవ వీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలు 4వ బెటాలియన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 4వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరై, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.... అణచివేతపై, పెత్తందారుల అరాచకాలపై ఎదిరించి నిలిచిన వీరుడు పండుగ సాయన్న అని కొనియాడారు. పేద ప్రజల ఆకలి తీర్చడం కోసం, వారి హక్కుల కోసం సాయన్న చేసిన పోరాటం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పండుగ సాయన్న తెలంగాణ రాబిన్ హుడ్‌గా ప్రసిద్ధి. సమాజంలో వెనుకబడిన, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. మహనీయుల ఆశయాలను, వారి పోరాట పటిమను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తర్వాత పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సావాల్లో భాగంగా బెటాలియన్ సిబ్బంది మరియు అధికారులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రజాస్వామ్య




వ్యవస్థలో ప్రజలు పోలిసుల నుండి ఎటువంటి సేవలను ఆశిస్తారు. పోలీసు అధికారుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర -సోషల్ మీడియాకు బానిస కాకుండా ఉండటం ఎలా క్షేత్ర స్థాయిలో పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం అంశాలపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కమాండెంట్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమాండెంట్ బి.రాజు ఆధ్వర్యంలో ఆర్ఐ రాంప్రసాద్, ఆర్ఎస్ఐలు సంపత్, సురేందర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ రాజు, మెడికల్ ఆఫీసర్ డా. అరుణ్, ఎఒ వసీం ఫర్హానా, ఆర్ఐలు కార్తీక్, రాజ్ కుమార్, రాంప్రసాద్, కృష్ణ, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

# చిరుతపల్లిలో ఘనంగా కొమరం భీమ్ జయంతి వేడుకలు

### చిత్రపటానికి పూలమాలలు వేసిన ప్రజలు

### కొమరం భీమ్ ఆశయాలను సాధిద్దాం..పిలుపునిచ్చిన కుంజ మహేష్, వాసం నాగరాజు



**నూగూర్ వెంకటాపురం అక్టోబర్ 22(జనం సాక్షి ):-** అడవి, నీళ్లు, భూముల పైన ఆదివాసీలకు హక్కులు కల్పించాలని కొమరం నిరంకుశ వాది అయిన నిజాం నవాబ్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఆదివాసీ మహా వీరుడు కొమరం భీమ్. గురువారం ఆయన జయంతి కార్యక్రమాన్ని చిరుతపల్లి గ్రామం లో ఆదివాసీ నవ నిర్మాణసేన వెంకటాపురం మండల అధ్యక్షులు వాసం నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి, కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. కొమరం ఆశయాలు సాధించాలని నారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏ ఎన్ ఎస్ జిల్లా కన్వీనర్ కుంజ మహేష్ పాల్గొని మాట్లాడుతూ... కొమరం భీమ్ నిజాం నవాబ్ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన మహా నాయకుడు అని మహేష్ కొనియాడారు. ఆదివాసీల హక్కుల కోసమే కాదు, తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడినట్టు ఆయన తెలిపారు. ఆయన పోరాట ఫలితంగానే 1/70, అటవీ హక్కుల గుర్తింపు చట్టాలు వచ్చాయని అన్నారు. నేడు పాలకుల దోపిడీ విధానాల వల్ల ఆదివాసీలకు రక్షణగా వచ్చిన చట్టాలు అమలుకు నోచుకోకపోగా, నిత్యం ఉల్లంఘనకు గురి అవుతున్నాయని అన్నారు. ప్రజలు వాటిని అమలు చేయాలనీ పాలకులని ప్రశ్నించాలని అన్నారు. ఆదివాసీ చట్టాలు అమలు కాకుండా గిరిజనేతరులు రాజకీయ పార్టీలను అడ్డుపెట్టుకొని 1/70 చట్టాన్ని ఉల్లంఘించి కబ్జా చేసిన ప్రభుత్వ భూములకు అక్రమంగా పట్టాలు పొందుతున్నట్టు ప్రజలకు వివరించారు. ప్రజలు మారి పోరాటాల్లో భాగస్వామ్యం కాక పోతే భవిష్యత్ నరకప్రాయంగా ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లోఇర్ప. బాబు, కోరం రమేష్, నల్లేబోయిన సుధాకర్, మిచ్చ నర్సింహులు, కచ్చులపు సత్యం, అంగన్వాడీ టీచర్ చేలే వెంకటరమణ, వాసం సుజాత, కుర్సం అర్జున్, లక్ష్మి నర్సు యువత పెద్దలు పాల్గొన్నారు.

# పర్వతగిరిలో ముదిరాజుల ఆరాధ్య వీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలు



**పర్వతగిరి, అక్టోబర్ 22: (జనం సాక్షి)** తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ప్రసిద్ధి చెందిన ప్రజావీరుడు, ముదిరాజుల ఆరాధ్య వీరుడు పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను గురువారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రావుల రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ.. నిజాం పాలన కాలంలో దొరలు, దేశ్‌ముఖ్‌ల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప ప్రజావీరుడు పండుగ సాయన్న అని కొనియాడారు. అణగారిన వర్గాల ప్రజల పక్షాన నిలిచి, సంపన్నుల నుంచి సంపదను తీసుకొని పేదలకు పంచిన ధీరుడిగా ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం పండుగ సాయన్న చేసిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. పాల్గొన్న నాయకులు..ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రావుల రాజు, ఉపాధ్యక్షులు అల్లాడి ఎల్లస్వామి, ధోని దేవేందర్, టౌన్ అధ్యక్షుడు నిరటి వెంకన్న ముదిరాజ్, ఏఎంసీ జిల్లా డైరెక్టర్ గొడుగు బిక్షపతి ముదిరాజ్, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ అల్లాడి నరసయ్య ముదిరాజ్, మండల యువజన అధ్యక్షుడు పిట్టల రాజు ముదిరాజ్, మండల కార్యదర్శి గుర్రం యాదగిరి, పులుగుజ్జు రాజు, టౌన్ ఉపాధ్యక్షుడు కొండ వెంకటేశ్వర్లు, యువజన కార్యదర్శి నిరటి రమేష్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల మత్స్యశాఖ అధ్యక్షులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# వంపుతండాలో మరమ్మత్తు అభివృద్ధి పనులు ప్రారంభం

### 1వ వార్డు సభ్యులు బోడ శ్రీనివాస్ నాయక్





**గూడూరు,అక్టోబర్22(జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లైన్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని వంపుతండాలో 1వ,2వ వార్డులల్లో మరమ్మత్తు అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు వార్డు సభ్యులు బోడ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వంపుతండాలో వర్షాకాలంలో గ్రామ ప్రజలు, వాహన దారులు సైతం అవస్థలు పడుతున్నారని చిత్తడిగా మారిన రహదారులను అభివృద్ధి చేయాలనే తపనతో రహదారులపై మట్టి పోయిస్తూ ,డ్రైనేజి పనులను చేపట్టినట్లు బోడ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తండా వాసులు పాల్గొన్నారు.

# 5వ బెటాలియన్‌లో పండుగ సాయన్న జయంతి వేడుకలు





**గోవిందరావుపేట అక్టోబర్ 18 సాక్షి :** మండలంలోని చల్వాయి గ్రామంలో 5వ బెటాలియన్ టీజీఎస్పీ కార్యాలయంలో పండుగ సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పండుగ సాయన్న చేసిన సేవలను,ఆయన ధైర్యసాహసాలను స్మరించుకున్నారు. సమాజంలో ధైర్యం, ఆత్మగౌరవం, సమానత్వం వంటి విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ టి. కలిదాస్, అసిస్టెంట్ కమాండెంట్ ఆర్. అరుణ్ రాజ్ కుమార్, ఆర్ఐలు వెంకటేశ్వర్లు, శ్రీధర్, ఆర్ఎస్ఐ ఏ సందీప్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల పక్షాన నిలిచిన

### ప్రజావీరుడు పండుగ సాయన్న

### ఎస్పీ సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ జానపద చరిత్రలో పేదల పక్షాన నిలిచి అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ప్రజావీరుడు సాయన్న అని అన్నారు. ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, సమానత్వం, సేవాభావంతో బలహీన వర్గాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ, ఆర్ఐలు కాశీరాం, పూర్ణచందర్, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్య ద్వారానే సమాజంలో సామాజిక స్థితిగతులు మారుతాయి

### స్వేరోస్ ములుగు జిల్లా అధ్యక్షులు వావిలాల రవితేజ



**ఏటూరునాగారం,అక్టోబర్ 22(జనంసాక్షి).** విద్య, సమానత్వం, సామాజిక చైతన్యమే స్వేరో ఉద్యమ ప్రధాన ఆశయమని స్వేరోస్ ములుగు జిల్లా అధ్యక్షులు వావిలాల రవితేజ అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని నమ్మిన డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తూ, వారి ప్రతిభను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు స్వేరో నెట్ వర్క్ కృషి చేస్తోందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో గురుకుల విద్యా వ్యవస్థకు అంకురార్పణ చేసి, అక్షరానికి దూరంగా ఉన్న అణగారిన పేద వర్గాలకు విద్యాభివృద్ధికి పాటుపడిన ఘనత ఎస్ఆర్ శంకరన్ దేనని అన్నారు. గురుకులాల వ్యవస్థను ఏర్పాటు చేసి పేద వర్గాల విద్యకు ఆయన చేసిన సేవలు గొప్పవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ స్వేరో నాయకులు వావిలాల కిషోర్ కుమార్, ఎంపెల్లి రాజు, మామిడి రాజు, మామిడి చింటూ, దీపక సాగర్, వావిలాల రామారావు, ఎం పెల్లి జాషువా, చిరంజీవి, పెద్దబోయిన చిరంజీవి, రెబ్బల లక్ష్మణ్, వావిలాల అనిల్ కుమార్, ఎం డి అసిఫ్, అల్లూరి అభిలాష్, కొమురం శివకుమార్ పాల్గొన్నారు.

# ఉచితంగా కంటి అద్దాల పంపిణీ

## జనతా ట్రస్ట్ చైర్మన్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి



**చెన్నారావుపేట, అక్టోబర్ 22(జనం సాక్షి):** మండల కేంద్రంలో జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న పెద్దలకు జనతా ట్రస్ట్ చైర్మన్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో కంటి సమస్య ఉన్న ప్రతి ఒక్కరికి కంటి ఆపరేషన్ చేయించినట్లు తెలిపారు. అవసరం ఉన్నవారికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.వయస్సులో పెద్దవారికి కంటి సమస్య లేకుండా ప్రతి రోజూ వాళ్ళ అవసర నిమిత్తం పనులు చేసుకునే విధంగా నర్సంపేట నియోజకవర్గంలో కంటి సమస్య ఎవరికి లేకుండా చెయ్యడమే నాయొక్క లక్ష్యం అని అన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మల్లయ్య, దుంకదువ్వ రంజిత్, సంగెం శంకర్, మురహరి విజయ్, అచ్చ దయాకర్, ఈదునూరి విజయ్, కందాల చంద్రమౌళి, మేరుగు కుమార్, లక్ష్మీనారాయణ, వీరేంద్రనాథ్, విరమల్ల మహేందర్, మారాటి ఉప్పులయ్య, మేడి సంతోష్, వీరు, కాటి హరీష్, రాకం రాకేష్,పడిదం హరి కృష్ణ, జనతా ట్రస్ట్ మిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

జనంసాక్షి

# నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రైవేట్ ఆసుపత్రులపై కఠిన చర్యలు

- కాటారంలో ఆరు ప్రైవేట్ ఆసుపత్రుల్లో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీలు..

**కాటారం, అక్టోబర్ 22 (జనం సాక్షి):** ప్రైవేట్ ఆసుపత్రులు వైద్య నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అర్హత కలిగిన వైద్యులు మాత్రమే రోగులకు చికిత్స అందించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మధుసూదన్ స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గురువారం కాటారం మండల కేంద్రంలోని ఆరు ప్రైవేట్ ఆసుపత్రులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలాజీ హాస్పిటల్, శ్రీ లక్ష్మీ హాస్పిటల్, సాయి హాస్పిటల్, రఫీ హాస్పిటల్, సురేష్ హాస్పిటల్, రాజరాజేశ్వరి హాస్పిటళ్లలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ రిజిస్ట్రేషన్లు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, అగ్ని ప్రమాదాల నివారణకు



చేపట్టిన చర్యలు, ఆసుపత్రుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి ఆసుపత్రిలో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా కనిపించే ప్రదేశంలో ప్రదర్శించాలని, రోగులకు అర్థమయ్యేలా చికిత్స రుసుములు, వివిధ వైద్య సేవల ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నమోదు చేసి భద్రపరచాలని సూచించారు. అర్హత కలిగిన వైద్యులు మాత్రమే ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలు అందించాలని, వైద్య అర్హతలు లేని వ్యక్తులతో రోగులకు చికిత్స చేయించకూడదని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు. రోగుల భద్రత, వైద్య సేవల నాణ్యత విషయంలో నిర్లక్ష్యం వహించరాదని పేర్కొన్నారు. ఆసుపత్రుల నిర్వహణలో నిర్దేశిత నిబంధనలను పాటించకపోతే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పీఓ ఎన్‌సీడీ డా. దేవేందర్, పీఓ ఎంసీహెచ్ డా. శ్రీదేవి, పీఓ ఎన్‌టీఈపీ డా. సందీప్, హెచ్‌ఈ శ్రీదేవి, కాటారం స్థానిక వైద్యాధికారి డా. మౌనిక పాల్గొన్నారు.



## దుర్గామాత నిమజ్జనాలు ప్రశాంతం

**భైంసా, అక్టోబర్ 22 (జనంసాక్షి)** భైంసా, ముధోల్ పట్టణాల్లో దుర్గామాత నిమజ్జనోత్సవాలు పోలీసుల పటిష్ట బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిశాయి. భక్తులు, ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ భైంసాలో 300 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల స్వయంగా భైంసాలో పర్యటించి శోభాయాత్ర మార్గాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, నిమజ్జన ప్రదేశాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణాన్ని నాలుగు సెక్టర్లుగా విభజించి కీలక ప్రాంతాల్లో పోలీసులను మోహరించారు. ట్రాఫిక్ నియంత్రణ, బైక్ పెట్రోలింగ్, రూఫ్‌టాప్ బందోబస్తు, స్టాటిక్ బందోబస్తు, పుషింగ్ పార్టీలను ఏర్పాటు చేశారు. ముధోల్ పట్టణంలోనూ ఎస్పీ పర్యటించి కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్, పోలీసు ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి

**నిర్మల్ బ్యూరో , అక్టోబర్ 22: (జనంసాక్షి) :** కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, అధికారులు, ముదిరాజ్ సంఘ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఇతర శాఖల అధికారులు, ముదిరాజ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.



## టిఆర్ఎస్ మీడియా సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా బానోత్ వెంకన్న నాయక్

**గూడూరు, అక్టోబర్22 (జనంసాక్షి):** తెలంగాణ రక్షణ సేన మీడియా కమిటీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా భానోత్ వెంకన్న నాయక్ కు నియమించినట్లు తెలంగాణ రక్షక సేన వ్యవస్థాపకులు కల్వకుంట్ల కవిత తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొల్లెపల్లి గ్రామానికి చెందిన బానోత్ వెంకన్న నాయక్ 15 సంవత్సరాలుగా మీడియా రంగంలో పనిచేసిన ఆయన తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆవిర్భవించినప్పటి నుండి తన బాధ్యతలను నెరవేరుస్తూ,గతంలో జూబ్లీహిల్స్ జెండా పండుగ అబ్జర్వర్ గా నియమించిన కవితక్క పార్టీకి,ప్రజలకి అనుసంధానంగా ఉండే మీడియా



వ్యవస్థలో తనను గుర్తించి ఈ అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ నాకు ఈ పదవి ఇచ్చిన కవితక్కకి కృతజ్ఞతలు .నాకు ఈ పదవి రావడానికి సహకరించిన రూప్సింగ్ నాయక్, కిషన్ నాయక్, శ్రీకాంత్ గౌడ్, మాధవి లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచిన తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత గారికి కృతజ్ఞతలు తెలిపారు తనకిచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహించడమే కాకుండా పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.

## మాట్టేవాడలో కొమురం భీం జయంతి వేడుకలు

- ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు ముయ్యబోయిన వెంకన్న

**గూడూరు, అక్టోబర్22 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మట్టేవాడ గ్రామంలో గురువారం కొమురం భీం 125వ,జయంతి సందర్భంగా అయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. ఈసందర్భంగా ముయ్యబోయిన వెంకన్న మాట్లాడుతూ కొమరం భీం 1901వ, సంవత్సరంలో ఆధునిక తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ తాలూకాలో గోండు గిరిజన కుటుంబంలో జన్మించారని, ఆయన ఫార్మల్ విద్య పొందకపోయినా,జీవితంలో ఎదురైన అన్యాయాలు గిరిజనులపై జరుగుతున్న దోపిడి ఆయనను పోరాట యోధుడిగా తీర్చిదిద్దినాయని అన్నారు భీమ్ జల జంగల్ జమీన్ మీద గిరిజనుల హక్కుల కోసం నిజం ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారని



తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ దొర బిజ్జా పొట్టయ్య పటేల్,రేగ వెంకటేశ్వర్లు, మండలం పిసా మొబలైజర్ ఆగబోయిన సమ్మయ్య, పిసా కార్యదర్శి బిజ్జా నరసయ్య, ఆదివాసి ఉపాధ్యాయులు రేగ పాపారావు, పూణెం భద్రయ్య,ముయ్యబోయిన వెంకన్న,రేగ వెంకన్న,రేగ సురేందర్,మేడ కళా వెంకట్,బిజ్జా రణధీర్,సోలం ప్రవీణ్, ఐలబోయిన భూపతి రావు, బొడ్డు రాములు, పూణెం సుధాకర్ శ్రీపతిరావు, పెనక అశోక్ పాల్గొన్నారు.

## డ్రగ్స్ వద్దు - ఆటలే ముద్దు...

**వెంకటాపురంలో సీఐ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ**



**నూగూర్ వెంకటాపురం అక్టోబర్ 22 (జనం సాక్షి):** మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా, యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు వెంకటాపురం పోలీసులు “సే నో టు డ్రగ్స్ – చూస్ క్రికెట్ నాట్ డ్రగ్స్ “ అనే నినాదంతో భారీ ర్యాలీ నిర్వహించారు. వెంకటాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ముత్యం రమేష్ ఆధ్వర్యంలో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ తాటి సరస్వతి అధ్యక్షతన ఈ ర్యాలీ వెంకటాపురం మెయిన్ రోడ్ లో సాగింది. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ కొప్పుల తిరుపతి రావు మాట్లాడుతూ… “ఆటలు ఆడటం వల్ల శరీర దారుఢ్యం పెరుగుతుంది, స్నేహభావం, క్రమశిక్షణ ఏర్పడుతుంది. డ్రగ్స్ వంటి మత్తుకు అలవాటు పడితే ప్రాణహాని తప్పదు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి” అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిఐ ముత్యం రమేష్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు అమ్మిన, సేవించిన రవాణా చేసిన చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా అమ్మిన,సేవించిన, రవాణా కార్యక్రమాలు జరిపిన వెంటనే పోలీస్ శాఖ వారికీ సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ వ్యతిరేక బ్యానర్ తో అవగాహన కల్పిస్తున్న సీఐ ముత్యం రమేష్, ఎస్‌ఐ కొప్పుల తిరుపతి రావు, సర్పంచ్ తాటి సరస్వతి, పోలీస్ సిబ్బంది మరియు యువత. ఈ ర్యాలీలోట్రైని ఎస్సై తిరుపతి రెడ్డి, పారెస్ట్ అధికారులు,పోలీస్ సిబ్బంది,సీఆర్పీ ఎఫ్ సిబ్బంది,గ్రామ పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం

పనులను వేగవంతం చేయాలని సూచించారు. నీటి సంరక్షణలో భాగంగా ప్రతి గ్రామంలో ఉన్న ఆర్వో ప్లాంట్ల దగ్గర వృథాగా పోయే నీటిని అరికట్టేందుకు బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్లు లేదా ఇంకుడు గుంతలు నిర్మించాలని స్పష్టం చేశారు. ఇష్టానుసారంగా మోటార్లు ఆన్ చేసి నీటిని వృథా చేయకుండా, అవసరమైన మేరకే విద్యుత్, నీటిని వినియోగించుకోవాలని సూచించారు. బోథ్, ఇచ్చోడ, ఉట్నూర్ వంటి మండలాల్లో పీఎం సూర్యఘర్ పథకం కింద రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుంటే పూర్తి ఫైనాన్సింగ్ తో పాటు సబ్సిడీ సైతం వస్తుందని, దీని ద్వారా విద్యుత్ ఆదా చేసుకోవచ్చని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, డీఏఓ రవీందర్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ చంద్ర మోహన్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డీపీఓ రమేశ్, డీవీఏహెచ్ఓ రామారావు, డీడీ గ్రౌండ్ వాటర్ సతీష్, ఈఈ ఇరిగేషన్, ఎస్‌ఈ ఎన్పీడీసీఎల్ సుభాష్, డీఎంహెచ్ఓ సాధన, మండలాల ప్రత్యేక అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హోలిస్టిక్ రూరల్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ద్వారా అభివృద్ధి చర్యలు

అర్హులైన ప్రజలకు అందించడం పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముందుగా గ్రామాలలో అవసరాలను గుర్తించి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని తెలిపారు. మారుమూల లింగాపూర్, సిర్పూర్ యు మండలాలపై సంస్థ దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం భూముల రీ సర్వేలో భాగంగా దుగ్గాపూర్ శివారులో చేపట్టిన రీ సర్వే ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. దుగ్గాపూర్, గోయగాం గ్రామాల మధ్యలో వర్షాకాలంలో దెబ్బతిన్న లో లెవెల్ వంతెనను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో మండల తహసిల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నగేష్, హెచ్ డి ఎఫ్ సి రీజనల్ హెడ్ వెంకటేష్ చల్లా, జోనల్ హెడ్ జోష్ స్టీఫెన్, సి వై డి ఓ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వర్ రావు, సంబంధిత అధికారులు, సర్పంచులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## పండుగ సాయన్న జీవితం నేటి తరానికి ఆదర్శం..

- అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరొందిన పండుగ సాయన్న జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. గురువారం ఐడీఓసీలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పండుగ సాయన్న జయంతిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలపై దోపిడీని, భూస్వాముల పెత్తనాన్ని ఎదిరిస్తూ పేదల పక్షాన నిలిచిన యోధుడు సాయన్న అని కొనియాడారు. మహబూబ్‌నగర్‌లోని మెరుగోనిపల్లెకు చెందిన సాయన్న సంపన్నుల నుంచి ధాన్యం తీసుకుని పేదలకు పంపిణీ చేస్తూ, నిరుపేదల పెళ్లిళ్లకు సాయం చేస్తూ ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల అధికారి చిర్రా రఘు, ముదిరాజ్ సంఘం నాయకులు ఆకుల సుభాష్, బీసీ సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

